# కలం

kalamdaily.com

Follow on: Kalamtelugu

ప్రజల గళం...

గురువారం • 16-04-2026

పేజీలు: 4


360° SINGLE TOPIC

జనంలోకి నేతలు

అధికారం కోసం పాదయాత్రలతో ప్రజల్లోకి వెళ్లడం తెలుగు రాష్ట్రాల్లో పొలిటికల్ లీడర్లకు ఓ ఆనవాయితీ. ప్రతిపక్షంలో ఉన్న నేతలు ఈ ఫార్ములాను ఒంటబట్టించుకున్నారు. పవర్‌లోకి రావడానికి ఇదో టర్నింగ్ పాయింట్ అని విశ్వసిస్తారు. కొందరు లీడర్లు సక్సెస్ అయ్యారు. మరికొందరికి బెడిసికొట్టింది. కొందరు పాదయాత్రలు చేపడితే.. మరికొందరు హైబ్రిడ్ యాత్రలు చేశారు. ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. దానికి తగినట్లు హామీలతో మేనిఫెస్టోలను రూపొందించుకున్నారు.



వైఎస్ రాజశేఖర్ రెడ్డి సీఎల్పీ నేతగా ఉన్నప్పుడు 2003లో మహాప్రస్థానం పేరిట ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ జిల్లాలన్నింటినీ చుట్టేలా పాదయాత్ర చేపట్టారు. చంద్రబాబు ప్రభుత్వాన్ని గద్దెదింపి అధికారంలోకి వచ్చారు. ఆ తర్వాత దాన్నే చంద్రబాబు కూడా నమ్ముకున్నారు. 'వస్తున్నా మీ కోసం' అంటూ జనం బాట పట్టారు. ఫలితంగా కొత్తగా ఏర్పడిన 13 జిల్లాల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రి అయ్యారు.

ఏపీలో వైఎస్ జగన్, నారా లోకేశ్, పవన్ కల్యాణ్.. తెలంగాణలో వైఎస్ షర్మిల, భట్టి విక్రమార్క, బండి సంజయ్ కూడా యాత్రలతో జనంలోకి వెళ్లారు. షర్మిల మినహా మిగిలినవారికి ఇవి కలిసొచ్చాయి. వీరిలో కొందరు పవర్‌లోకి వచ్చారు. బండి సంజయ్ లాంటి వాళ్లు కేంద్ర మంత్రులయ్యారు. పదేండ్లు అధికారంలో ఉండి మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయాన్ని మూటగట్టుకున్న బీఆర్ఎస్ కూడా పాదయాత్రకు రెడీ అవుతున్నది. ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వచ్చే ఏడాది నుంచి రంగంలోకి దిగుతానని ప్రకటించారు.

'పాదయాత్రలు ఔట్‌డేటెడ్ కాన్సెప్ట్.. ఇప్పటి టెక్నాలజీ పరిస్థితుల్లో అది వర్కౌట్ కాదు..' అని అధికారంలో ఉన్నప్పుడు 2022లో కేసీఆర్ కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు. ఇప్పుడు ప్రధాన ప్రతిపక్ష నేతగా కనీసం ప్రజలనూ కలవడంలేదు. అందుబాటులోనూ లేరు. ఫామ్‌హౌజ్‌కే పరిమితమయ్యారు. 'మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్సే.. ముఖ్యమంత్రి అయ్యేది కేసీఆరే.. ప్రజలు కూడా అదే కోరుకుంటున్నారు..' అంటూనే పాదయాత్రకు సిద్ధమవుతున్నారు కేటీఆర్. గెలుస్తామన్న ధీమా ఉన్నప్పుడు పాదయాత్ర అవసరమేంటనే ప్రశ్నకు సమాధానం లేదు.

కేటీఆర్ పాదయాత్ర బీఆర్ఎస్‌కు మైలేజీ ఇస్తుందా?.. ఓట్లను రాలుస్తుందా?.. ఔట్‌డేటెడ్ కాన్సెప్ట్‌ను ఎందుకు ఎంచుకున్నారు?.. కేసీఆర్ అభిప్రాయంతో కేటీఆర్ విభేదిస్తున్నారా?.. పదేండ్ల పాలనలోని తప్పులకు పాదయాత్రలో కేటీఆర్ క్షమాపణలు చెప్తారా?.. కొత్త పార్టీ పెడతానంటున్న చెల్లెలు కవితతో పొలిటికల్ త్రెట్ ఉందనుకుంటున్నారా?.. ఓట్లు, సీట్లు, అధికారం చుట్టూ తిరుగుతున్న పాదయాత్రలపై **కలం 360 డిగ్రీస్** ప్రత్యేక కథనం..

- తెలంగాణ బ్యూరో, కలం

# పొలిటికల్ యాత్రలతో ఓట్లు రాలేనా?




- వైఎస్సార్ నుంచి భట్టి దాకా పాదయాత్రలు
- ఔట్ డేటెడ్ కాన్సెప్ట్ అనే ధోరణిలో కేసీఆర్
- వచ్చే ఏడాదిలో కేటీఆర్ రాష్ట్రవ్యాప్త పర్యటన
- పదేండ్ల పాలనలోని తప్పులపై సారీ చెప్తారా?
- పొలిటికల్ సర్కిల్స్ లో ఇదే హాట్ టాపిక్





## వైఎస్సార్.. మహాప్రస్థానం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2003లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి మహాప్రస్థానం పేరిట పాదయాత్ర చేపట్టారు. నాడు ఏప్రిల్ 9నలో రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నుంచి ప్రారంభమైన ఈ పాదయాత్ర.. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం వరకు దాదాపు 1,475 కిలోమీటర్ల మేర సాగింది. మొత్తం 11 జిల్లాలను ఈ యాత్ర కవర్ చేసింది. 2003 జూన్ 15న ముగిసింది.

**ఉద్దేశం ..**

అప్పట్లో ఉమ్మడి ఏపీలో నెలకొన్న తీవ్ర కరువు పరిస్థితులను, రైతుల కష్టాలను నేరుగా తెలుసుకోవడం. వరుస ఓటములతో కుంగిపోయిన కాంగ్రెస్ కార్యకర్తల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపడం. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, సామాన్య ప్రజలకు 'నేనున్నాను' అనే భరోసా కల్పించడం.

**ఫలితం..**

వైఎస్సార్ చేపట్టిన పాదయాత్రే 2004లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి ప్రధాన కారణమైంది. ఈ యాత్రలోనే ఆయన ఉచిత విద్యుత్ హామీని ప్రకటించారు. ఇది రైతుల్లో విపరీతమైన ఆదరణ పొందింది. అలాగే ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాల ఆలోచనలకు ఈ యాత్ర నేర్పిన అనుభవాలే మూలం.



## వైఎస్ జగన్.. ప్రజా సంకల్ప యాత్ర

వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఓదార్పు యాత్ర, ప్రజా సంకల్ప యాత్ర చేపట్టారు. తండ్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆకస్మిక మరణం తర్వాత అభిమానులను పరామర్శించే లక్ష్యంతో ఓదార్పు యాత్ర చేపట్టారు. 2017 నవంబర్ 6న ఏపీలోని ఇడుపులపాయ నుంచి ప్రజా సంకల్ప యాత్ర పేరిట పాదయాత్ర ప్రారంభించారు. 2019 జనవరి 9 వరకు దాదాపు 341 రోజుల పాటు 3,648 కిలోమీటర్ల మేర ఈ యాత్ర సాగింది.

**ఉద్దేశం ..**

'రావాలి జగన్ - కావాలి జగన్' నినాదంతో క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకోవడం. అప్పటి తెలుగుదేశం ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం. వైసీపీ అధికారంలోకి వస్తే అమలు చేయబోయే నవరత్నాలు (తొమ్మిది రకాల సంక్షేమ పథకాలు) గురించి ప్రజలకు వివరించడం.

**ఫలితం..**

ప్రజా సంకల్ప యాత్ర ఫలితంగా 2019 అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ 175 స్థానాలకు గానూ 151 స్థానాల్లో ఘనవిజయం సాధించి అధికారంలోకి వచ్చింది. జగన్ సీఎం అయ్యారు.

### మళ్లీ యాత్ర!

2024 అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 11 సీట్లకే పరిమితమై, ప్రతిపక్ష హోదాను కూడా కోల్పోయిన వైఎస్ జగన్.. త్వరలో ఏపీలో పాదయాత్ర చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే గ్రౌండ్ ప్రిపేర్ చేసుకుంటున్నారు. ఐదేండ్లు అధికారం అనుభవించిన ఆయన ఆ తర్వాత ఎన్నికల్లో ఘోర పరాజయం పాలవడం, ఇప్పుడు పాదయాత్రకు బయలుదేరుతుండటంతో జనం ఎలా ఆదరిస్తారన్నది ప్రశ్నార్థకం. ఐదేండ్లలో జరిగిన తప్పులను ప్రజల ముందు ఒప్పుకుంటారా? ప్రజల నుంచి వచ్చే ప్రశ్నలకు ఏం సమాధానం చెప్తారన్నది టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నుంచి వస్తున్న ప్రశ్నలు.

## షర్మిల.. ప్రజా ప్రస్థానం

తెలంగాణలో 'రాజన్న రాజ్యం' తెస్తానంటూ వైఎస్సార్ తెలంగాణ పార్టీని స్థాపించిన వైఎస్ షర్మిల.. 2021 అక్టోబర్ 20న రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నుంచి 'ప్రజా ప్రస్థానం' పేరిట పాదయాత్ర చేపట్టారు. 2023 జనవరి 3న ముగిసింది. దాదాపు 350 రోజులపాటు తెలంగాణలో 3,800 కిలోమీటర్లకు పైగా ఆమె పర్యటించారు.

**ఉద్దేశం..**

తెలంగాణలో నోటిఫికేషన్లు రాక ఆత్మహత్యలు చేసుకుంటున్న నిరుద్యోగుల పక్షాన నిలవడం. తన తండ్రి వైఎస్సార్ హయాంలో జరిగిన సంక్షేమ పాలనను మళ్లీ తెలంగాణలో ప్రవేశపెట్టడం. అప్పటి అధికార పక్షం (బీఆర్ఎస్), ప్రధాన ప్రతిపక్షాలపై విమర్శలు చేస్తూ, వైఎస్సార్ తెలంగాణ పార్టీ (వైఎస్ఆర్‌టీపీ)ని బలమైన ప్రత్యామ్నాయంగా నిలపడం.

**ఫలితం..**

పాదయాత్రతో షర్మిల తెలంగాణలో జనంలోకి వెళ్లగలిగారు. కానీ, 2023 అసెంబ్లీ ఎన్నికల నాటికి వైఎస్సార్ టీపీని కాంగ్రెస్ లో ఆమె విలీనం చేశారు. ఆ తర్వాత ఏపీ రాజకీయాలకు పరిమితమయ్యారు. అయితే.. షర్మిల చేపట్టిన పాదయాత్రతోనే కేసీఆర్ గద్దె దిగే పరిస్థితి వచ్చిందని ఆమె అభిమానులు చెప్తుంటారు.



kalamdaily.com
Follow on: Kalamtelugu



## చంద్రబాబు.. వస్తున్నా మీ కోసం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకునే లక్ష్యంతో చంద్రబాబు నాయుడు చేపట్టిన పాదయాత్రే 'వస్తున్నా మీ కోసం'. 2012, అక్టోబర్ 2న అనంతపురం జిల్లా హిందూపురంలో ప్రారంభమైన ఈ యాత్ర.. 208 రోజులపాటు 2,817 కిలోమీటర్ల వరకు సాగింది. 2013 ఏప్రిల్ 2న విశాఖపట్నంలో భారీ బహిరంగ సభతో ముగిసింది.

**ఉద్దేశం ..**

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతులు ఎదుర్కొంటున్న కరెంటు కష్టాలు, పెరుగుతున్న ధరలు, అవినీతి వంటి సమస్యలను నేరుగా తెలుసుకోవడం. వరుసగా 2 సార్లు అధికారానికి దూరమైన తెలుగుదేశం పార్టీ కేడర్లో ధైర్యాన్ని నింపి, ఎన్నికలకు సిద్ధం చేయడం. 'వస్తున్నా మీ కోసం' ద్వారా ప్రజల అవసరాలను గుర్తించి, వాటిని పార్టీ మేనిఫెస్టోలో చేర్చడం.

**ఫలితం..**

ఈ యాత్ర ద్వారా సంపాదించిన ప్రజాభిమానమే 2014 ఎన్నికలలో విభజిత ఏపీలో తెలుగుదేశం పార్టీ విజయం సాధించడానికి, చంద్రబాబు సీఎం కావడానికి ప్రధాన కారణమైంది.



## లోకేశ్.. యువగళం

టీడీపీ చీఫ్ చంద్రబాబు నాయుడు కొడుకు నారా లోకేశ్ 2023 జనవరి 27న చిత్తూరు జిల్లా కుప్పం నుంచి యువగళం పేరిట పాదయాత్ర చేపట్టారు. అదే ఏడాది డిసెంబర్ 18న విజయనగరం జిల్లాలోని గజపతి నగరంలో ఇది ముగిసింది. 226 రోజులు 3,132 కిలోమీటర్ల మేర యాత్ర సాగింది.

**ఉద్దేశం ..**

ఏపీలో పెరుగుతున్న నిరుద్యోగం, జాబ్ క్యాలెండర్ లేకపోవడంపై పోరాడటం. అప్పటి వైసీపీ ప్రభుత్వ అవినీతి, అరాచక పాలనను ఎండగట్టడం. క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకోవడం ద్వారా లోకేశ్ తనను తాను ఒక బలమైన నాయకుడిగా నిరూపించుకోవడం.

**ఫలితం..**

2024 అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అఖండ విజయం సాధించడంలో ఈ యాత్ర ఓ కీలక పాత్ర పోషించింది. లోకేశ్ ఒక సమర్థవంతమైన నాయకుడిగా గుర్తింపు పొందారు. మంగళగిరి నియోజకవర్గంలో రికార్డు మెజారిటీతో ఆయన గెలిచారు.



## పవన్ కల్యాణ్.. వారాహి

ఆంధ్రప్రదేశ్‌లో అధికార మార్పు లక్ష్యంగా జనసేన అధినేత పవన్ కల్యాణ్ 2023 జూన్ 14న అన్నవరం నుంచి వారాహి యాత్ర చేపట్టారు. వారాహి అనే వాహనంపై నుంచి పవన్ చేసిన ప్రసంగాలు, ముఖ్యంగా ఉభయ గోదావరి జిల్లాల్లో రాజకీయ వేడిని పెంచాయి. 2023 సెప్టెంబర్‌లో ఈ యాత్ర ముగిసింది. 3,000 కిలోమీటర్లకు పైగా సాగింది.

**ఉద్దేశం..**

ప్రతిపక్ష ఓట్లు చీలకుండా చూడటం, వైఎస్సార్ సీపీ వైఫల్యాలను ఎండగట్టడం. కౌలు రైతుల కష్టాలు, ఉపాధి హామీ, స్థానిక సమస్యలపై గళమెత్తడం.

**ఫలితం..**

ఈ యాత్ర ద్వారా వచ్చిన స్పందనతో తెలుగుదేశం, బీజేపీతో కలిసి జనసేన కూటమిగా ఏర్పడటంలో కీలక పాత్ర పోషించింది. వారాహి యాత్ర ప్రభావంతో గోదావరి జిల్లాల్లో జనసేన తిరుగులేని విజయాన్ని సాధించింది. ఏపీ వ్యాప్తంగా పోటీ చేసిన 21 అసెంబ్లీ స్థానాల్లోనూ (100% స్ట్రైక్ రేట్) విజయం సాధించి రికార్డు సృష్టించింది.



## భట్టి విక్రమార్క.. పీపుల్స్ మార్చ్

2023లో అప్పటి ప్రతిపక్ష నేత మల్లు భట్టి విక్రమార్క 'పీపుల్స్ మార్చ్' పేరిట అదే ఏడాది మార్చి 16న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పిప్రి గ్రామం నుంచి పాదయాత్ర చేపట్టారు. జూలై 2న ఖమ్మంలో జనగర్జన బహిరంగ సభతో ముగించారు. ఈ సభకు రాహుల్ గాంధీ చీఫ్ గెస్ట్‌గా హాజరయ్యారు. మొత్తం 109 రోజుల పాటు 1,365 కిలోమీటర్ల మేర పాదయాత్ర కొనసాగింది.

**ఉద్దేశం..**

కేసీఆర్‌ను గద్దె దించడం. ధరణి పోర్టల్ లోపాలు, పోడు భూముల సమస్యలు, నిరుద్యోగం, సాగునీటి ప్రాజెక్టుల పెండింగ్ పనుల గురించి తెలుసుకోవడం. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లడం. నిస్తేజంగా ఉన్న కాంగ్రెస్ కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపి, ఎన్నికలకు సిద్ధం చేయడం.

**ఫలితం..**

2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించడానికి భట్టి పాదయాత్ర కూడా ఓ కీలక పాత్ర పోషించింది. మాస్ లీడర్‌గా భట్టి విక్రమార్క ఎదిగేందుకు యాత్ర దోహదపడింది.



## బండి సంజయ్.. ప్రజా సంగ్రామం

తెలంగాణలో బీజేపీని ప్రత్యామ్నాయ శక్తిగా నిలబెట్టే లక్ష్యంతో బండి సంజయ్ 2021 ఆగస్టు 28న హైదరాబాద్‌లోని చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయం వద్ద ప్రజా సంగ్రామ యాత్ర ప్రారంభించారు. 5 విడతలుగా ఇది సాగింది. 2023 ఆగస్టులో ఇది ముగిసింది. దాదాపు 130 రోజులపాటు 1,300 కిలోమీటర్లకు పైగా బండి సంజయ్ పాదయాత్ర చేపట్టారు.

**ఉద్దేశం..**

అప్పటి కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన హామీలైన నిరుద్యోగ భృతి, డబుల్ బెడ్రూమ్ ఇళ్లు, రుణమాఫీ వంటివి అమలు చేయలేదని ఎండగట్టడం. కుటుంబ పాలన, అవినీతి లేని తెలంగాణను నిర్మించడమే లక్ష్యంగా ప్రచారం చేయడం. ప్రధాని మోదీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లడం.

**ఫలితం..**

తెలంగాణలో బీజేపీని ఒక ప్రత్యామ్నాయంగా ప్రజలు గుర్తించేలా చేయడంలో ఈ యాత్ర సఫలమైంది. ఈ యాత్ర హుజూరాబాద్, మునుగోడు వంటి ఉప ఎన్నికల్లో బీజేపీకి భారీ మైలేజీని ఇచ్చింది. ఐదు విడతలుగా సాగిన ఆ యాత్ర ముగింపు సభల్లో అమిత్ షా, జేపీ నడ్డా వంటి అగ్రనేతలు హాజరవడంతో పార్టీ కేడర్ లో జోష్ వచ్చింది. రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకరాలేకపోయినప్పటికీ.. బండి సంజయ్ వంటి బీజేపీ కీలక నేతలు ఎంపీలుగా గెలిచేందుకు ఇది దోహదపడింది.

## కవిత..జనం బాట

బీఆర్‌ఎస్ నుంచి తెగదెంపులు చేసుకున్న కవిత ఈ నెల 25న తన కొత్త పార్టీ పేరు, జెండా, ఎజెండా ప్రకటించనున్నారు. ఇప్పటికే తెలంగాణ జాగృతి సంస్థను రాజకీయ క్షేత్రంగా మార్చుకుని వివిధ కార్యక్రమాలు చేపట్టారు. 2025 అక్టోబర్ 25 నుంచి 2026 ఫిబ్రవరి 13 వరకు దాదాపు నాలుగు నెలల పాటు 'జాగృతి జనం బాట' కార్యక్రమం నిర్వహించారు. ప్రతి జిల్లాలో రెండ్రోజులు పర్యటించి, ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. రైతులు, మహిళలు, ఉద్యమకారులు, భూనిర్వాసితులు తదితర వర్గాలను కలిశారు. ప్రజా సమస్యలపై పోరాడతానని, ప్రజలకు అండగా ఉంటానని చెప్పారు. ఈ నేపథ్యంలో త్వరలో పార్టీ పెట్టనున్న కవిత కూడా పాదయాత్ర చేస్తారా? అనే చర్చ మొదలైంది.



## త్వరలో కేటీఆర్ యాత్ర

పదేండ్ల పాలనలో ప్రజలకు ఎంతో చేశామని, అయినా జనం బీఆర్‌ఎస్‌ను కాదని కాంగ్రెస్‌ను తెచ్చుకున్నారని కేసీఆర్, కేటీఆర్ చాలాసార్లు కామెంట్ చేశారు. బీఆర్‌ఎస్ ఓటమికి ప్రజలనే నిందించారు. పాలిచ్చే బర్రెను కాదని, దున్నపోతును తెచ్చుకున్నారని వ్యాఖ్యానించారు. పార్టీ ఓటమికి ప్రజలదే తప్పు అన్నట్టుగా మొదట్లో వ్యాఖ్యలు చేసిన కేటీఆర్.. ఇప్పుడు జనంలోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. "అధికారంలో ఉన్న పదేండ్ల కాలంలో పార్టీ క్యాడర్‌కు, ప్రజలకు కొంత గ్యాప్ వచ్చిన మాట నిజమే. దీంతో గత అసెంబ్లీ ఎన్నికల్లో నష్టం జరిగింది" అని ఆయన తాజాగా వ్యాఖ్యానించారు. పార్టీ పేరును మార్చడంతోనూ కొంత నష్టం జరిగిందని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై 2027లో పాదయాత్ర ప్రారంభిస్తానని చెప్పారు.

**క్షమాపణలు చెప్తారా?**

పదేండ్లు అధికారంలో ఉన్నప్పుడు కనీసం జనాన్ని కలువలేదన్న విమర్శలు కేటీఆర్ పై ఉన్నాయి. చేసిన తప్పులకు త్వరలో చేపట్టబోయే యాత్రలో ఆయన ఏం సమాధానం చెప్తారని కాంగ్రెస్ ప్రశ్నిస్తున్నది. బీఆర్ ఎస్ ఓడిపోవడానికి ఇన్నాళ్లూ ప్రజలే కారణమన్నట్లుగా మాట్లాడిన కేటీఆర్.. ఇప్పుడు తప్పు తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారని, అయితే దాన్ని జనం ఎంతవరకు విశ్వసిస్తారన్నది పొలిటికల్ సర్కిల్స్ లో చర్చకు దారితీసింది. పైగా బీఆర్‌ఎస్ నుంచి బయటకు వచ్చిన కవిత.. త్వరలో కొత్త పార్టీ ప్రకటించనున్నారు. బీఆర్ ఎస్ పదేండ్ల పాలనపై ఆమె విమర్శలు గుప్పిస్తున్నారు. జరిగిన తప్పులకు తనను క్షమించండి అంటూ ప్రజలను కోరుతున్నారు. వీటిపై పాదయాత్రలో కేటీఆర్ ఏం చెప్తారన్నది ప్రశ్నార్థకం.

